క్లుప్తంగా

బసవేశ్వర విగ్రహావిష్కరణకు ఆహ్వానం



జహీరాబాద్ ఎంపీకి ఆహ్వానపత్రం అందజేస్తున్న వీరశైవలింగాయత్ సభ్యులు

కడ్తాల్: మండల కేంద్రంలో ఈనెల 22న ఏర్పాటు చేయనున్న విశ్వగురు శ్రీమహాత్మా బసవేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని స్థానిక వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమాజం సభ్యులు శనివారం పలువురు ప్రజాప్రతినిధులను, వివిధ పార్టీల నాయకులను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ నాయకుడు సంగప్పతో పాటు పలువురి నాయకులకు వారు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం నాయకులు ఈశ్వరప్ప, వెంకటేశ్, సర్వేశ్వర్, మల్లప్ప, డాక్టర్ రమేశ్, శ్రావణ్, లింగప్ప తదితరులున్నారు.

నిరుపేదలకు చేయూతనందిస్తాం



గ్యాస్ పొయ్యి అందజేస్తున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

తలకొండపల్లి: నిరుపేదల ఆర్థికాభివృద్ధికి చేయూతనందించి వారికి అండగా ఉండి ఆదుకుంటామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఉపనమోని ఈదయ్యకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిలిండర్ గ్యాస్ పొయ్యి అందజేస్తానని చైర్మన్ భరోసా పలికారు. ఈ మేరకు శనివారం రాఘవేందర్‌రెడ్డి గ్యాస్ పొయ్యిని ఈదయ్యకు తలకొండపల్లిలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్, యాదగిరి బోళ్ల, శ్రీనివాస్, మహేశ్, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆపన్నహస్తం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేవారే నిజమైన స్నేహితులని నిరూపించుకున్నారు. రూ.86 వేలు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడ గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబం గడవడం ఇబ్బందిగా మారింది. ఈ మేరకు బాధిత కుటుంబానికి 1995–96 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు రూ.86 వేలు అందజేసి అండగా నిలిచారు. సతీష్‌కుమార్‌కు ఇంకా ఎవరైనా ఆర్థికసాయం చేయాలనుకుంటే 98662 08130 నంబరుకు గూగుల్‌పే, ఫోన్‌పే చేసి ఆదుకోవాలని అతని సతీమణి శ్రీలత కోరారు.

మాజీ సర్పంచ్ మృతి

యాచారం: మండల పరిధిలోని చింతుల్ల గ్రామ మాజీ సర్పంచ్ సామర్ది బుగ్గరాములు (85) అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందాడు. 1981 నుంచి 1995 వరకు రెండు దఫాలుగా బుగ్గరాములు చింతుల్ల గ్రామానికి సర్పంచ్‌గా సేవలు అందించాడు. బుగ్గరాములు మృతి పట్ల ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డిలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చింతుల్ల గ్రామాభివృద్ధి కోసం బుగ్గరాములు చేసిన కృషి మరువలేనిదని అన్నారు.

పరామర్శ

మహేశ్వరం: మండల పరిధిలోని నాగారం ఉపసర్పంచ్ ఎండీ.లతీఫ్ ఖాన్ మాతృమూర్తి అమీనాబీ మృతి చెందారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు వారి నివాసానికి వెళ్లి సంతాపం వ్యక్తం చేశారు. లతీఫ్ ఖాన్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో నాగారం సర్పంచ్ బండారి లావణ్య లింగం, మార్కెట్ డైరెక్టర్ కర్రె రాజు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మీర్‌పేట: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బి.సత్యనారాయణ కథనం ప్రకారం.. గుర్రంగూడ ఆదిత్యనగర్‌కు చెందిన రవిప్రసాద్ (56) మానసిక స్థితి సరిగా లేదు. ఈనెల 7వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా భోగి వేడుకలు

ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు పట్టణాల్లో శనివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేసుకొని ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులకు రేగు పండ్లను పోశారు. ప్రతీ గడప ముందు మహిళలు రంగవల్లులు వేసి అలరించారు. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా పతంగులు ఎగురవేసి పండుగను సంతోషంగా జరుపుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: మైసిగండిలో భోగి పండుగలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గ్రామ ప్రజలు



తలకొండపల్లి: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు, ప్రజలు



కడ్తాల్: మైసిగండిలో గాలిపటం ఎగురవేస్తున్న ఓ కుటుంబం

వాలీబాల్ పోటీలు ప్రారంభం



తుర్కయంజాల్: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ సత్యనారాయణ, తదితరులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని సుందరయ్య నగర్ కాలనీలో ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ మహిళా సంఘం, ప్రజా నాట్యమండలి కేవీపీఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను శనివారం వనస్థలిపురం సీఐ సత్యనారాయణ ప్రారంభించారు. యువతకు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం, స్నేహ భావం పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, కౌన్సిలర్ కాకుమాను సునీల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్, సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.యాదయ్య, మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహా, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఆమనగంటి వెంకటేశ్, నాయకులు భాస్కర్, పున్న శ్రీనివాస్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి పెంచుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి (బంటి) అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కర్ణంగూడ గ్రామంలో ఉప్పరిగూడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ నల్లబోలు అంజిరెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ నల్లబోలు మమత శ్రీనివాస్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తా

మాడ్గుల: ప్రజల మధ్యలో ఉంటూ వారి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడితండాలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను శనివారం స్థానిక సర్పంచ్ నేనావత్ స్వప్నతో కలిసి రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం యువకులకు క్రికెట్ కిట్ అందజేశారు. ఇటీవల గుడితండాకు వచ్చిన సమయంలో తండా ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజనులు సుంకిరెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని అన్నారు. ఫౌండేషన్ తరఫున ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శోభ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గుడితండాలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుంకిరెడ్డి

ఉచిత విద్యనందించడం గొప్ప విషయం



వెంకటాపూర్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వరరావు

మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్

తలకొండపల్లి: వేలాది మంది విద్యార్థులకు జెడ్పీటీసీ వెంకటేశ్ ఉచిత విద్యనందించడం చాలా గొప్ప విషయమని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు, చుక్కాపూర్, చంద్రధన, వెల్జాల్, వెంకటాపూర్, తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. వెంకటాపూర్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన 22 నూతన గృహాలను ప్రొఫెసర్ నాగేశ్వర్‌తో కలిసి జెడ్పీటీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిర్మణి నిర్మల, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, వైస్ చైర్మన్ రవికుమార్, సర్పంచ్‌లు గోపాల్‌నాయక్, లలితమ్మ, జ్యోతయ్య, రఘుపతి, ఎంపీటీసీలు అంబాజీ, సునీత, దర్శన్‌రెడ్డి, రమేశ్, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, మాజీ ఎంపీపీ లక్ష్మిదేవి జేఏసీ నాయకులు సదానందం పాల్గొన్నారు.

సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించాలి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: దేశ సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో గల వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో, బాలచైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్ అధ్యక్షతన, పర్యావరణ బాల చైతన్య కేంద్రాల విద్యార్థిని, విద్యార్థులకు శనివారం ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మన పూర్వీకులు నుంచి వచ్చిన సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, ప్రతిఒక్కరూ వాటిని గౌరవించాలని సూచించారు. ప్రతీ పండుగలో ఒక ప్రత్యేకత ఉందని, సంక్రాంతి పండుగ రైతన్నల అందరి పండుగ అని చెప్పారు. ఈ మేరకు పోటీలకు కందుకూరు, కడ్తాల్ మండలాల్లోని ఉట్లపల్లి, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, దసర్లపల్లి, కడ్తాల్, అన్మాస్‌పల్లి తదితర గ్రామాల నుంచి 84 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, నాయకులు జగన్‌గౌడ్, రాజుగౌడ్, సీజీఆర్ ప్రతినిధులు వంశీ, కోటేశ్, ఎర్త్ లీడర్ రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



పతంగుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

వైభవం.. గోదా రంగనాథస్వామి కల్యాణం

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో శ్రీ రుక్మిణీ సత్యభామ వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీ గోదారంగనాథస్వామి వారి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు వింజమూరు రామానుజాచార్యుల బృందం వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకను వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంతో పాటు సమీప గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణ వేడుకను తిలకించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, తహసీల్దార్ జ్యోతి, ఎంపీటీసీ గోపాల్, నాయకులు కృష్ణ, బాల్‌రాజ్, రమేశ్, నర్సింహ, పండితులు ఆదిత్యాచార్యులు, రంగాచార్యులు, చక్రవర్తి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దేవుని పడకల్‌లో..

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి దంపతులు స్వామివారు, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కన్నులపండువగా జరిగిన ఈ కల్యాణ వేడుకలకు హైదరాబాద్, జహీరాబాద్, శంషాబాద్, తదితర పట్టణాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మోహన్ రావు, సర్పంచ్ శ్రీశైలం, ఉపసర్పంచ్ తిరుపతి,, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీటీసీ రవి, భక్తులు మంజుల, డోకూరి ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, నవీన్‌రెడ్డి, కృష్ణగౌడ్, సిస్పల్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి, సత్యనారాయణ, రాజ్‌కుమార్, ఆలయ అసిస్టెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.



కడ్తాల్ : గోదా రంగనాథస్వామి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు



తలకొండపల్లి: దేవుని పడకల్‌లో గోదా కల్యాణం వేడుకలు

గెలుపోటములను సమ దృష్టితో చూడాలి

తలకొండపల్లి: గెలుపోటములను సమాన దృష్టితో చూస్తూ, క్రీడా స్ఫూర్తిని చాటాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. క్రీడలతో ఆరోగ్యం లభించడమే కాదు, ఐకమత్యం పెరుగుతుందని తెలిపారు. శుక్రవారం రాత్రి, శనివారం మండల పరిధిలోని జూలపల్లి, అంతారం గ్రామాల యువకులకు ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి క్రికెట్ కిట్‌లు అందజేశారు. అదేవిధంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చుక్కాపూర్‌లో ప్రీమియర్ లీగ్ సీజన్ 01 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు.

సీసీ రోడ్లకు రూ.4.80 కోట్లు మంజూరు

కందుకూరు: పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పరిధిలో కందుకూరు మండలంలో వివిధ గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణాలకు గాను రూ.4.80 కోట్ల నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అగర్‌మియాగూడ బాచుపల్లి, చిప్పలపల్లి, ధన్నారం, గూడూరు, జబ్బార్‌గూడ, జైత్వారం, కొలన్‌గూడ, లేమూరు, మురళీనగర్, రాచులూరు గ్రామాలకు రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయని చెప్పారు. కందుకూరు, నేదునూరుకు, గుమ్మడవెల్లి, రూ.30 లక్షల చొప్పున, తిమ్మాపూర్‌కు రూ.25 లక్షలు, బేగంపేట, దాసర్లపల్లి, దెబ్బడగూడ, కటికపల్లి, సరస్వతిగూడలకు రూ.15 లక్షల చొప్పున వచ్చినట్లు పేర్కొన్నారు. ఆకులమైలారం, అన్నోజిగూడ తదితర గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు.

వామ్మో వానరులు

కోతుల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వామ్మో వానరులు అంటూ భయపడాల్సిన దుస్థితి నెలకొంది. ఒకేసారి గుంపులు గుంపులుగా వచ్చి ఇళ్లల్లోకి చొరబడుతున్నాయని వాపోతున్నారు. అడవులను వదిలిన వానర సైన్యం ఇళ్లల్లో స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్ గంగానగర్ కాలనీలో కోతుల బెడదతో ప్రజలు పడుతున్న ఇబ్బందలపై ప్రత్యేక కథనం..



ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్ గంగానగర్ కాలనీలో కోతులు

- కోతులతో ఇబ్బందులు పడుతున్న గంగానగర్ కాలనీ
- హడలెత్తుతున్న ప్రజలు
- భయాందోళనకు గురవుతున్న వైనం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లోని గంగానగర్ కాలనీలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతీరోజు ఇళ్ల చుట్టూ తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఒంటిరిగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు కనిపిస్తే దాడి చేసి గాయాలు పాలుచేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్లనే చుట్టుముట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు.

అధికారులు స్పందిస్తేనే సమస్యకు చెక్..

మున్సిపాలిటీ అధికారులు స్పందించి కోతులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కొద్ది నెలలుగా కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా స్పందించి కోతులను పట్టుకొని ఆడవి ప్రాంతాల్లో వదిలిపెటేలా చర్యలు చేపట్టాలంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ప్రతీరోజు మా కాలనీలోకి కోతులు వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గుంపులు గుంపులుగా వచ్చి భయపెడుతున్నాయి. ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నాం. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలి.

– సామల జయమ్మ, గంగానగర్ కాలనీ, బొంగ్లూర్

కోతుల బెడద లేకుండా చేస్తా



మున్సిపాలిటీలోని గంగానగర్ కాలనీలో కోతుల బెడద లేకుండా చేస్తాం. త్వరలోనే అధికారుల దృష్టికి తీసుకుపోయి చర్యలు తీసుకుంటాం. పాలకవర్గం అనుమతితో నిధులు కేటాయించి కోతులను పట్టుకుపోయే ఏర్పాట్లు చేస్తా. గతంలో కూడా పాలకవర్గం దృష్టికి తీసుకుపోయాం. మరోమారు దృష్టికి తీసుకుపోయి కోతుల బెడదకు చర్యలు తీసుకుంటాం.

– కుంట్ల మౌనిక, కౌన్సిలర్

క్రీడా స్ఫూర్తిని చాటాలి

తలకొండపల్లి: గెలుపోటములను సమ దృష్టితో చూడాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ లీగ్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో యువతకు మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రయ్య, రెడ్డి సేవా సమితి మండల ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ భగవాన్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి

కీడలు ఐకమత్యం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం మండల పరిధిలోని చంద్రధనలో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ రాములు, నేతలు వెంకటేశ్, రాజు, జంగయ్య, మల్లేశ్, మణికంఠ, ఆర్గనైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

యాచారం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయని యాచారం సీఐ లింగయ్య అన్నారు. మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో లిక్కి శ్రీనువాస్‌రెడ్డి జ్ఞాపకార్థం మన ఊరు–మన బడి ఆధ్వర్యంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను సీఐ ప్రారంభించారు. ఈ పోటీలకు నిర్వాహకులు మొదటి బహుమతి కింద రూ.10 వేలు, రెండో బహుమతి కింద రూ. 5 వేలు నిర్ణయించారు. మొత్తం 8 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పలు పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: గెలుపొందిన ఎల్మినేడు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చిత్తాపూర్‌లో..

మంచాల: మండల పరిధిలోని చిత్తాపూర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడోత్సవాలు శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్వరం గోవర్ధన్‌చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహ పూర్వక వాతావరణంలో క్రీడోత్సవాలు నిర్వహించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొడ్డు నాగరాజ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ దన్నె బాషయ్య, స్థానిక నాయకులు రమేశ్, కృష్ణ, కుమార చారి, బాలరాజ్, సత్యనారాయణ చారి, శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, హరిప్రసాద్ ,శివ, మధు, రాజేశ్, కిషన్, సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: చౌదర్‌పల్లిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నేతలు

ముగిసిన బీఆర్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్

ఇబ్రహీంపట్నం రూరల్: యువతలో ఉన్న క్రీడా నైపుణ్యం టోర్నమెంట్ల ద్వారా వెలికితీయవచ్చుని, వీటిని ప్రతీ క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ పీ.కృపేష్, తెలంగాణ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు నందారెడ్డి అన్నారు. సంక్రాంతి క్రీడోత్సవాలను పురస్కరించుకొని నాలుగు రోజులుగా బీఎస్‌ఆర్, బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇబ్రహీంపట్నం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ప్రథమ బహుమతి ఎల్మినేడు జట్టు కైవసం చేసుకుంది. రన్నరఫ్‌గా పోచారం జట్టు నిలిచింది. విన్నర్ జట్టుకు బహుమతిగా రూ.55,526 నగదు, రన్నర్ జట్టుకు రూ.25,526 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, ఉపసర్పంచ్ బూడిద నర్సింహారెడ్డి, పోచారం ఉపసర్పంచ్ భగీరథ సాగర్, నాయకులు సురేందర్‌రెడ్డి, గోపాల్, నర్సింహాగౌడ్, శేఖర్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

సీఐ మహేందర్‌రెడ్డి



నిషేధిత చైనా మాంజాను స్వాధీనం చేసుకుంటున్న సీఐ మహేందర్‌రెడ్డి

మీర్‌పేట: నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.మహేందర్‌రెడ్డి వ్యాపారస్తులను హెచ్చరించారు. రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్, నందనవనం, డీఎంఆర్ఎల్ కాలనీ, హస్తినాపురం, భూపేష్‌గుప్తానగర్, కర్మన్‌ఘాట్, బడంగ్‌పేట ప్రాంతాల్లో గాలిపటాలు, మాంజా విక్రయిస్తున్న దుకాణాలపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్న చౌదరిపేట విజయ్ భాస్కర్, గుంటూరు ధర్మరాజు, ఎండీ.అహ్మద్అలీఖాన్, ఎస్.సాయిలపై పర్యావరణ పరిరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేసి మాంజాను స్వాధీనం చేసుకున్నారు. మాంజా వాడటం వల్ల ప్రజల ప్రాణాలకు హాని కలుగుతుందని చెప్పారు.